రసభంగం

"నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?"

"లోకంలో అన్నిటికంటే నిన్ను యెక్కువగా ప్రేమిస్తున్నాను. నాహృదయాధి దేవతా! నీ కోసం నా ప్రాణాలనే త్యాగం చెయ్యడానికి సిద్ధంగా వున్నాను...ఒక్కసారి నీ చక్కటి శరీరాన్ని నా చేతుల్లో..."

శకుంతల ఒక్కసారిగా పుస్తకాన్ని శక్తికొద్దీ విసిరి కొట్టింది. అది కిటికీ ఊచలకి తగులుకుని, కొంచెంసేపు నిస్సహాయంగా ఊగులాడి చివరకి క్రిందపడ్డది. ఆమెకి కోపం తీరలేదేమో, లేచి ఆ పుస్తకాన్ని తీసి కిటికీలోంచి బైటపడవేసింది.

పుస్తకం తియ్యబోయేసరికి యిదీ కథ! ప్రేమ... మోహం...ఇంతేకాబోలు వీళ్ళకి వచ్చినది! "నీకోసం చచ్చిపోతాను - కాఫీ మానేస్తాను-అదీ చేస్తానూ యిదీ చేస్తానూ"

అనడం—అక్కడినుంచి మామూలుగా కృష్ణతా - అంతా చవకబారు కథలు!

కిటికీలోంచి శకుంతల బయటికి చూసింది. తూర్పువైపు ఉన్న స్టూడెంట్ల లాడ్జినిండా దీపాలు. అందరూ చదువుకుంటున్నట్లున్నారు. మార్చిగా మరి! నిరుడు తానూ అలాగే బాధపడ్డది!

టైము చూసింది...పదిన్నర. నిద్రపోదామని మళ్ళా మంచంమీద వాలింది శకుంతల. నిద్రవచ్చే సూచనలేమీ కనపడలేదు. చదువుకోడానికి పుస్తకాలేవీ లేవు. ఉన్నదొక్కటీ పైకి విసిరింది. మూడో అంతస్తులోనించి దిగి దానిని తెచ్చుకోవడం అసంభవం — తాను పడిన తొందరకి కొంచెం సిగ్గుపడ్డది శకుంతల...ఇంకా చదివితే కథ బాగుండునేమో!

ఒకటి రెండుసార్లు దొర్లింది కాని, లాభంలేదు — నిద్ర పట్టదు. ఏమిటిలాభం అలా పడుకుంటే?

లేచి లైటువేసింది. రేడియో పెట్టింది. ఇండియన్ స్టేషన్లన్నీ నిద్రపోతున్నై ... పన్నెండుదాకానైనా స్టేషన్లు పనిచెయ్యకపోతే ఎట్లా? అనుకుని చికాకుపడ్డది శకుంతల... అన్ని బేండ్లూ చూసింది ఏ ఫారెన్ స్టేషనయినా దొరుకుతుందని.

దొరికింది. ఏదో స్టేషనులో చక్కటి జంత్రసంగీతం వస్తోంది. పియానో, దాని వెనకాల ఎన్నో ఇతర వాద్యాలు. ఎంత హాయిగావుంది.

పద్దెనిమిదేళ్ళ యవ్వనం శకుంతలని ఆ సంగీతం వింటూం డగా నిశ్శబ్దంగా నియ్యలేదు. చిన్నప్పుడు కాన్వెంటులో చదువు తోండగా ఆమె నాట్యం నేర్చుకొనేది. ఈ ప్రశాంత వాతావర ణంలో, ఏకాంతంలో, ఈ చక్కని సంగీతానికి ఆమెలో నరా లన్నీ కదలిక పొందాయి. ఆనందంగా అడుగులు వేసుకుంటూ నాట్యం చెయ్యసాగింది.

టెలిఫోన్ గంట గణగణమోగింది.

శకుంతలకి కోపం వచ్చింది. ఎవరబ్బా ఈ అర్ధరాత్రిన పని వున్న మహానుభావుడు?

విసుగుతో రేడియో గొంతుక తగ్గించి, ప్రక్కనే వున్న టెలిఫోను తీసిందామె.

"ఇది నూటపదహారు...ఎవరది?"

"అక్కడ ఎవరు?"

"శకుంతల."

"నమస్తే, శకుంతలాదేవిగారూ!"

"నమస్తే...మీరెవరని అడిగాను."

"ఎవరినైతేనేమిలెండి—మీరు బి. ఏ. నిరుడేగా ప్యాస య్యారు?"

"తమకెందు కదంతా?"

"పని ఉండే లెండి-అర్ధరాత్రయేదాకా మీ రేడియో ఫుల్ బ్లాస్ట్‌లో వుంచి గోలచేస్తూంటే మా మాట యేమి టంటారు?"

"మీ రెవరో నాకు తెలీదు—అయితేనేం? సంగీతం విని సంతోషించండి."

"పరీక్షల్లో మా సంగీతం వినరుగా?"

"నేను వింటాలెండి."

"వింటే ఏం లాభం?"

"చెప్తాను—రేపోసారి కల్సుకోండి."

"పోనీ ఆ సాయం ఇప్పుడే చేయరాదూ?"

"ఏంటదీ?"

"మీ రేడియోగారి నోరు కట్టేయాలి."

"లేకపోతే?"

"మీకు తెలుసుగా?"

శకుంతలకి వళ్ళుమండింది — మంచిగా చెప్పరాదూ? అంత పొగరుమోతుతనం ఎందుకూ?

చేతిలోవున్న రిసీవర్ రేడియోమీద పెట్టి, టోన్ పూర్తిగా రైజ్ చేసింది. తన పనికి తానే నవ్వుకుంది...రెండు నిమిషాలయాక తీసింది.

అవతలాయన ఇంకా డిస్కనక్ట్ చెయ్యలేదు.

"చాలా బాగుందండీ సంగీతం."

"థాంక్స్—ఇంక చాలన్నుకుంటాను!"

"చాలకేం? కాని, వెంటనే కట్టేస్తారా?"

"అదలా వినిపిస్తూంటుందిలెండి. మీ సంగీతం మీరూ కానివ్వండి..."

రిసీవర్ పెట్టేసింది కోపంగా శకుంతల. రేడియో పాడుతూనే వుంది. కొన్ని నిమిషాలయాక కట్టేద్దామా అనుకుంది. కాని, అంత సులువుగా ఓటమిని అంగీకరించడం ఇష్టంలేక పోయిందామెకి.

లైటుమాత్రం ఆర్పి పడుకుంది. అనేక ప్రశ్న లామెని బాధించడం మొదలుపెట్టాయి. ఎవరా పిలిచినది? ఎందుకంత కటువుగా మాట్లాడాడు? చుట్టుప్రక్కల ఎవరో అయితీరాలి. కాని, ఎవరు? పెద్ద మగాణ్నని, నోరు కట్టేయాలిట!—ఇన్సల్ట్!

ఎదురుగావచ్చి, "మాకు పని చెడుతోంది; దయ వుంచి రేడియో పెట్టకండి!" అంటే తాను తప్పకుండా ఆ పని చేసి ఉండేనే. పోనీ, ఫోనులో అయినా మంచిగా అడగరాదూ? ఎందుకంత గర్వం?"

మళ్ళా ఆ ప్రశ్న...ఎవరతను? ఎలా వుంటాడు?...

ఎవరైతేనేం? చుట్టుప్రక్కల ఎవరో అయి వుంటాడు... అని తానే సమాధానం ఇచ్చుకుంది శకుంతల.

ఆమెకి తెలియకుండానే నిద్రపట్టిందా ఆలోచనలో. తెల్లారుఝామున మూడుకి రేడియోగోలకి తెలివి వచ్చింది. లేచి రేడియో కట్టేసి పడుకుంది మళ్ళా.

* * *

ఉదయం కాఫీ తాగుతూంటే తండ్రి అడిగాడు... "రాత్రి మూడుగంటలకి రేడియో పెట్టావేంటమ్మా?" అని.

"ఏదో ప్లే వస్తోంటే వింటున్నాను నాన్నా" అన్నది శకుంతల.

"అప్పుడెలా వచ్చింది? ఏ స్టేషను?"

"టొరంటో నాన్నా."

అసలా స్టేషనుందో లేదో తెలీదామెకి. తడుము కుంటే నాన్న అనుమానపడతాడు. ఆయన నిజమే నను కున్నాడు.

తన గదిలో కొచ్చేసరికి శకుంతలకి రాత్రి జరిగిన సంగతి అంతా జ్ఞప్తికి వచ్చింది. మరచిపోదామంటే మరీ మరీ జ్ఞప్తికి వచ్చాయి తా నాడిన మాటలు.

అతనెంత బాధపడ్డాడో! నిశ్చయంగా అతను తన నెరుగును. కనుకనే ఆ చనువు తీసుకున్నాడేమో! తానెంత కటువుగా మాట్లాడింది! — పాపం అతను చాలా సిగ్గుపడి వుంటాడు.

ఆ రోజంతా ఆమె నా జ్ఞప్తి వెంటాడుతూనే వుంది. కనిపించిన ప్రతీయువకుణ్ని ఆమె పరీక్షిస్తూంది తన కిటికీవైపు తేరిబారి చూస్తాడేమోనని. ఉహూఁ. ఎవ్వరూ చూడలేదు. ఎవరిపనుల్లో వాళ్ళు నిమగ్నులై ఉన్నారు.

ఏవో పుస్తకాలకోసం లైబ్రరీకి వెళ్ళింది. అక్కడ అంద రినీ పరీక్షించింది. ఆమె భావనకి సరిపడేవారెవరూ దొరకలేదు. పరధ్యానంగా షెల్ఫులు వెదుకుతూ దేనికోసం తాను వెదుకు తూందో మరిచిపోయింది.

ఆ రోజల్లా ఆమెకి కలలో బ్రతుకుతూన్నట్లుంది. ఆ ప్రశ్న ఆమెని వేధిస్తూంది.

సాయంత్రం ఎనిమిదయేదాకా రేడియో ఉంచుకుని తరవాత తీసేసింది శకుంతల. "పోనీ పాపం! చదువు నా మూలంగా పాడయి పరీక్ష సంగీతం పాడితే నామీద ఏడుస్తాడు" అనుకుంది.

తొమ్మిదయేసరికి టెలిఫోను మోగింది.

"నూటపదహారు..." అంది శకుంతల.

"నమస్తే!"

తృళ్ళిపడింది అమ్మాయి. ఆ గొంతుకే! మళ్ళా...

"నిన్నరాత్రి సంగీతానికి మిమ్మల్ని థాంక్ చేద్దామని పించింది. పోయిన చదువు పోతే పోయిందిగాని, చక్కటి ఆర్కెస్ట్రా సుమండి."

శకుంతల చాలా సిగ్గుపడ్డది. ఇంత మోటుగా ప్రవర్తిస్తున్న అతనిమీద ఆమెకి కోపమూ వచ్చింది.

"ఇది చెప్పండి—మీ పేరేమిటి?"

"ఏమైతేనేంలెండి? - న్యూసెన్సు కేసు పెట్టడానికా?"

"పెట్టనులెండి. చెప్పండి."

"కేసు పెట్టకపోతే పేరెందుకు ? పోనీ 'ఎక్స్' అనండి."

"మీ ఇల్లెక్కడ?"

"మీలాటివారి ఔన్నత్యాలక్రింద ... దానికేంలెండి.

ఈవేళ మీరు నన్ను డిస్టర్బ చెయ్యకూడదని నిశ్చయించుకున్నందుకు సంతోషం."

కోపంతో పెదవులు బిగబట్టి రిసీవర్‌ని క్రిందపడవేసి, శకుంతల రేడియో పెట్టింది. సాధ్యమైనంత యెక్కువ చేసింది వాల్యూమ్. రాత్రి పన్నెండుదాకా ఆపాటికి నిద్రపట్టలేదు. ఆమె అది సహించింది. రేడియో మాత్రం కట్టలేదు.

మరునాడు ఉదయం కాఫీతాగి కూర్చునేసరికి టెలిఫోన్ పిలిచింది. రిసీవర్ తీసేసరికి మళ్ళీ అదే గొంతుక!

"రాత్రి సంగీతానికి థాంక్ చేద్దామని పిల్చాను."

తెల్లబోయింది శకుంతల. మరుక్షణమే తెలివి తెచ్చుకుని "మీరు మీ మోటుతనానికి క్షమాపణ చెప్పేదాకా నా రేడియో గోలచేస్తోనే వుంటుంది—మీరు థాంక్ చేసినంత మాత్రాన రేడియో పెట్టడం మానేస్తానని ఆశ పడబోకండి" అన్నది.

నవ్వు..."నేను మోటుగా ప్రవర్తించానా?"

"అక్షరాలా. చేతనైతే ఎదుటపడండి. ఎంతమోటుగా ప్రవర్తించారో చెప్తాను."

"మీ కంతకోపం ఎందుకూ? క్షమాపణ కావాలంటే ఇప్పుడే యిచ్చేస్తాను."

"ఫోన్ క్షమాపణ అక్కర్లేదండి."

"నేరమైతే ఫోన్‌మీద చేశాగా?"

"అయినాను—"

"కాని నేను మీకు కనపడదల్చుకోలేదండి."

చికాకుగా రిసీవర్ పెట్టేసింది శకుంతల. అతనెవరో చూడాలనే కౌతుకం ఆమెకు రోజు రోజుకీ ఎక్కువౌతోంది. రోజూ ఈ టెలిఫోన్‌వల్ల తన ఆలోచనలు పెరిగిపోతున్నాయి. కొంపతీసి, అతనీ ప్రసంగం ఏ ప్రణయానికీ నాందిగా ప్రారంభించలేదుగద?

తన ఆలోచనకి నవ్వుకుంది శకుంతల. "శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక యువకుడు, ఒక యువతిని ప్రేమించాడట. అనుదినమూ ఫోన్‌ద్వారా ఆమె యోగక్షేమాలు తెలుసుకుంటూ ఉండేవాడట. కాని తానెవరో, ఎందు కలాగ చేస్తున్నాడో మాత్రం చెప్పేవాడుకాడట. సంవత్సరం ఇలాగ గడిచాక, ఆమె అతనెవరో తెలుసుకోలేకుండా ఉండలేక, "నువ్వెవరైనాసరే, నాదగ్గరికివస్తే వివాహమాడతాను. అని చెప్పిందట. తరవాత ఆ ఇద్దరూ పెళ్ళాడి సుఖంగా జీవిస్తున్నారు", అని ఒక వార్త పేపర్‌లో పడితే ప్రతివాళ్ళూ నమ్ముతారు. బహుశా ఈ యువకుడూ అలాటి పనేమీ చెయ్యడం లేదుగద?...అందులో పరీక్షలుకూడా అయిపోతే కావలసినంత తీరుబడి!

కాని, ఎవరితను?

◆ ◆ ◆ ◆

రోజూ రాత్రిళ్లు రేడియో పూర్తి వాల్యూమ్‌లో ఉంచుతోంది శకుంతల...ఈ గొడవ తగ్గించుకోవడానికి అతను వ్యక్తిపరంగా క్షమాపణ చెప్పుకుంటాడని ఆమె ఆశ.

ప్రతీరోజూ టెలిఫోన్‌లో అత నామెకి గతరాత్రి సంగీతానికి కృతజ్ఞత చెప్తున్నాడు.

"మీరీ రాత్రి సంగీతం పెట్టరని ఆశించవచ్చునా?"

"అలాటి ఆశేమీ పెట్టుకోవద్దు ... దాని కొక్కటే షరతు."

"నేను వచ్చి క్షమాపణ చెప్పాలా?"

"ఔను..."

టెలిఫోనులో నవ్వు..."సారీ..."

"వెరీసారీ..."

ఇదీ వరస. ఇలాగ పదిరోజులు గడిచిపోయాయి. ఆమె సంగీతం రాత్రంతా ఉంచుతోంది—ఈ మెసేజే వస్తూంది.

ఆ మరుసటిదినం శకుంతల సినీమాకి పోయింది. తిరి గొచ్చేసరికి టెలిఫోన్ ఒకే పనిగా అరుస్తోంది.

"నమస్తే శకుంతలాదేవిగారూ!"

"ఊఁ. ఏం?"

"అయితే మీరు పంతం వదలనంటారు?"

"మీరూ అంతే అంటున్నారుగా?"

"మీ కింతకోపం ఉండకూడదండీ ... నామాట విని ఈ రోజునుంచి రాత్రి నిశ్శబ్దం ఉండనివ్వండి."

జవాబుగా రేడియో సంగీతం టెలిఫోన్‌లోంచి వెళ్ళింది.

"శకుంతలాదేవీ!"

"సంగీతం చాల్లేదా?"

"నన్ను ఓడించారండీ!"

"సంతోషం."

"రేపు సాయంత్రం మీ దర్శనం చేసుకోమంటారా?"

"చిత్తం."

శకుంతల ఒక్కసారి సముద్రంలో మునిగినట్లయింది సంతోషంతో.

"ఎక్కడ?"

"నదివడ్డుకి రండి 5 గంటలకి. లవర్స్ బెండ్..."

"థాంక్యూ. సెలవు."

"సెలవు."

ఈ పదిరోజుల ఆట ఈనాటితో సరి! ఆ రాత్రి సంతోషపు టుద్రేకంలో నిద్రే పట్టలేదు. ఇంత గ్రిట్ ఉన్న యువకుడీని లొంగదియ్య గలిగినందు కామె చాలా గర్వపడింది. మర్నాడు సాయంత్రం జరుగబోయే కథ నామె భావించుకుంది...అతను వినమ్రుడై క్షమాపణ చెప్తాంటే ... పాపం! మగవాళ్ళు! అనుకుంది.

మర్నాడు తెల్లవారిన దగ్గరనించీ ఆమె సాయంత్రం కోసమె ఎదురు చూస్తోంది. రోజు మెల్లిగా నడుస్తోంది. సాయంకాలం వేసుకోబోయే దుస్తులను గురించి ఆమె ఆలోచిస్తూ ఎలాగో గడిపింది.

మూడున్నర అయిన దగ్గరనించీ ఆమె అలంకరించుకోసాగింది. "ఎందు కింత అలంకారం?" అని అనుమానం

ఆమెకి కలుగలేదు ... తాను పొందబోయే మహా విజయ గర్వంలో ఆమె మునిగితేలుతోంది.

సరిగ్గా అయిదు.

లవర్స్ బెండ్ దగ్గరకి వచ్చింది శకుంతల. చుట్టూ చూసింది. ఒక చెట్టుక్రింద ఎవరో ఒక ముసలాయన కూర్చుని ఏదో చదువుకుంటున్నాడు.

వాచీ చూసుకున్నది. అయిదూ రెండు నిమిషాలు.

తానే అక్కడికి ముందువచ్చినందుకు సిగ్గుపడ్డది శకుంతల. "వీళ్ళకి పంక్చువాలిటీ అంటే తెలియనే తెలియదు", అని గొణిగింది. కనుచూపుమేరలో ఆ ముసలాయన తప్పిస్తే ఇంకెవరూ లేరు.

కొద్దినిమిషా లామె అట్లానే నిల్చుంది. మధ్య మధ్య ముసిలాయన తనవంక చూస్తున్నాడని గ్రహించి ఒకచోట కూర్చున్నది. ఆయన ఎవరో పెద్దయింటాయనల్లె ఉన్నాడు.

అతనింకా రాడేమిటి?

తనని ఫూల్ చేస్తున్నాడా?

చుట్టూ చూసింది శకుంతల మళ్ళా. ఎవ్వరూ రావడం లేదు. ఏదో ఆలోచిస్తూ ఎలాగో అయిదున్నర అయేదాకా గడిపింది. ఆ యువకుడి జాడలేదు.

"డామ్‌హిమ్", అని గట్టిగా అని వెళ్ళిపోవడానికి లేచింది శకుంతల కోపంగా.

ముసిలాయన అప్పుడు చేతులో వున్న పుస్తకం

మూశాడు. "ఏమమ్మా అంత కోపంగా ఉన్నావ్?" అన్నాడాయన.

ఆమె నిజం చెప్పలేకపోయింది. "ఏమీలేదండి. ఊరకనే వచ్చాను. తోచడంలేదు. చికాకు పుడుతోంది", అన్నది.

ఆయన చిన్న నవ్వునవ్వాడు. 'నీ మాటలు అబద్ధం అని నాకు తెల్సులే' అనేట్లు. శకుంతల సిగ్గుపడ్డది.

"ముసిలివాళ్ళకి నిజంచెప్తే మంచే జరుగుతుందమ్మా. నాకు కొంచెం థాట్‌రీడింగ్ వచ్చును. నీపేరు శకుంతల కాదమ్మా?—సిగ్గుపడకు. అత నిక్కడికి రాడు", అని ఆగాడు.

ఆమె నిరాశగా చూసింది - దొరికిపోయా ననుకుంది. ఈయనెవరో మహానుభావుడల్లె ఉన్నాడే!

"అసలు జరిగిన సంగతి చెప్పేదా?" అన్నాడాయన ఒక్కక్షణం కళ్ళుమూసుకుని. ఎక్స్‌రే తీస్తోన్నట్లు ఫీల్ అయింది శకుంతల.

"...అతనువస్తే ఏంచేస్తావు?" అన్నాడాయన కళ్ళు తెరిచి.

"ఇంకెప్పుడూ అలా చెయ్యొద్దని చెప్తాను."

ఆయన మళ్ళా నవ్వాడు. చిన్నగా "నిజంగానా?"

"ఔనండీ..."

"అత నంత అపరాధం ఏం చేశాడని? మీ రేడియో తనని బాధిస్తోంది గనుక నిన్ను కొంచెం వాల్యూం తగ్గించ మన్నాడు. పెద్ద నేరం ఏమిటి చేశాడమ్మా?"

శకుంతల తల వంచుకున్నది.

"నాకు తెల్సునమ్మా, నువ్వు చాలా మంచిదానివని. అంతకోపం నీకు రానేరాదు. ఊరికేనే అతన్ని చూద్దామను కున్నావ్. కౌతుకం చాలా బలమైనదిగదూ మరి!"

"ఆయన ఎవరండీ?"

ముసిలాయన ఒక్కసారి ఆమెవైపు తన కళ్ళు తిప్పి,

"అబ్బే, చాలా ముసిలాయనలే అమ్మా",అన్నాడు.

శకుంతల దెబ్బ తిన్నది...... "ముసిలాయనా?" అన్నది.

"ఔనమ్మా..."

"పరీక్షకి చదువుతానన్నాడే?"

ఆయన పెద్దగా నవ్వాడీసారి..."అబద్ధంలే",అన్నాడు.

"ఎవరండీ ఆయన అసలు?"

"...నేనే నమ్మా..."

నిలువునా నీరై పోయింది శకుంతల. ఈయనా?...

"మీ ఇంట్లోనే క్రిందిభాగంలో ఉంటున్నాం. మా అల్లుడింటికి వచ్చాను. వాళ్ళ రేడియో చెడ్డది. నాకుపన్నెండు దాకా నిద్రపట్టదు. ఆ ఇంగ్లీష్ సింఫొనీలూ అవీ నా కిష్టం. అందుకని ఈ నాటకం వేశానమ్మా."

"నాతో చెప్తే..."

"పిల్లలమ్మా మీరు-పంతంతో ఏమన్నా చేయించగలం గాని, మంచిని అమ్మా!...నాటకంలా ఉందా?...ఏమనుకోవు గదూ?"

శకుంతలకి చాలా బాధగా ఉన్నది. పెద్ద దెబ్బతిన్న దానిలా తల దించుకున్నది.

"ముసిలాళ్ళమీద అంత కోపం అయితే ఎలామ్మా? కావలిస్తే నాతో దెబ్బలాడు. మా మనవరాలట్లానే లే..."

శకుంతలకి జరిగినదంతా తల్చుకోగానే నవ్వువచ్చింది. ఇక ఆగలేక నవ్వింది గట్టిగా.

"రేపు వెళ్తున్నా నమ్మాయ్. అందుకే నీకు కనిపించాను. వెళ్దామా?" అన్నాడాయన లేస్తూ.

"పదండి", అని వెనకాల బయలుదేరింది. కొంచెం దూరం వెళ్ళగానే సంభాషణ మొదలుపెట్టింది.

(ఆంధ్ర పత్రిక)
24-9- '52